RNI No: APTEL/2018/76747




# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | బుధవారం | సంపుటి: 9 | సంచిక: 230 | పేజీలు: 04 | వెల: 5 /- | 19 ఆగస్టు 2026 |
|---|---|---|---|---|---|---|


### దుబాయ్‌లో సానియా మీర్జా రాజమహల్.. ప్రత్యేక ఆకర్షణగా

## సల్మాన్ ఖాన్ పెయింటింగ్!





**ముంబై, నవతరం:** ప్రముఖ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా దుబాయ్‌లోని తన విలాసవంతమైన ఇంటిని అభిమానులకు పరిచయం చేశారు. నటి అర్చనా పురన్ సింగ్, ఆమె భర్త పర్మీత్ సేథీ, వారి కుమారులతో కలిసి ఇటీవల సానియా ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా సానియా స్వయంగా తన ఇంటిలోని ప్రతి గదిని చూపిస్తూ, దాని వెనుక ఉన్న విశేషాలను పంచుకున్నారు. ఈ ఇంటి ఇంటీరియర్‌ను పూర్తిగా తన అభిరుచికి తగ్గట్టు సానియానే డిజైన్ చేసుకోవడం గమనార్హం.

ఇంటి లోపలికి అడుగుపెట్టగానే రాజసం ఉట్టిపడేలా బంగారు, తెలుపు, నీలం రంగులతో కూడిన ఫార్మల్ లివింగ్ రూమ్ ఆకట్టుకుంటుంది. పురాతన వస్తువుల స్ఫూర్తితో రూపొందించిన ఈ గదిలో భారీ షాండ్లియర్ (ఝూమర్), గోల్డెన్ వాల్‌పేపర్, ఖరీదైన కార్పెట్లు, ఉర్దూలో రాసిన వాక్యాలతో ఉన్న ఫ్రేములు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే, తమ కుటుంబం ఎక్కువగా సమయం గడిపేది ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న ఇన్ఫార్మల్ లివింగ్ రూంలోనే అని సానియా తెలిపారు. టీవీ చూస్తూ, క్రికెట్ మ్యాచ్‌లు ఆస్వాదిస్తూ ఇక్కడే రిలాక్స్ అవుతామని ఆమె చెప్పారు.

ఈ ఇంటిలోని ఓ గెస్ట్ రూమ్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. నలుపు, తెలుపు రంగుల థీమ్‌తో ఉన్న ఈ గదిలో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ స్వయంగా వేసి బహుమతిగా ఇచ్చిన పెయింటింగ్స్ ఉన్నాయి. నమాజ్ చేస్తున్న వ్యక్తి చిత్రపటాలు ఈ గది గోడలకు అందాన్ని తెచ్చాయి. ఇక ఇంట్లో ఓ 'షో కిచెన్' కూడా ఉంది. అయితే ఇందులో కేవలం కాఫీ మాత్రమే పెడతారని, వంట చేయరని సానియా నవ్వుతూ చెప్పారు. అసలైన వంటగది బయట స్విమ్మింగ్ పూల్ పక్కన ఉందని తెలిపారు.

కొడుకు ఇజాన్ కోసం ఇంటి బయట స్విమ్మింగ్ పూల్, గార్డెన్, విశాలమైన ప్లే ఏరియాను ఏర్పాటు చేశారు. ఇజాన్ గదిలో ప్లేస్టేషన్, డ్రమ్ సెట్, ఫుట్‌బాల్ టేబుల్ వంటివి ఉన్నాయి. వీటితో పాటు, ప్రార్థనల కోసం ఓ ప్రత్యేక గది, వాక్-ఇన్ వార్డ్‌రోబ్, తన కెరీర్‌లో గెలుచుకున్న పద్మశ్రీ వంటి అవార్డులను ప్రదర్శించేందుకు ఓ ప్రత్యేక స్థలాన్ని కూడా సానియా చూపించారు. ప్రస్తుతం దుబాయ్‌లో నివసిస్తున్నప్పటికీ, హైదరాబాద్‌లో తన సొంత స్థలంలో 'సానియా మీర్జా టెన్నిస్ అకాడమీ' (SMTA) నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. తాను ఆవు పేడతో అలికిన టెన్నిస్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేసిన రోజులతో పోల్చితే, నేటి తరానికి మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఈ అకాడమీని నిర్మించినట్లు వివరించారు.



### మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి

## ఒక ఎకరం భూమిస్తాం



**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు.

రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

### భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు



**హైదరాబాద్, నవతరం:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం సాయంత్రం బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. విమానంలో బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగారు.

ఈ బెదిరింపు నేపథ్యంలో, విమానాశ్రయ భద్రతా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు వెంటనే తనిఖీలు ప్రారంభించాయి. ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించి, విమానాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. విమానాశ్రయ ప్రాంగణంలోనూ భద్రతను కట్టుదిట్టం చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు, ఈ బాంబు బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో నిఘా వర్గాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

### నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి



**అమరావతి, నవతరం:** తెలుగుదేశం పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే నిజమైన కార్యకర్తలను పార్టీ ఎల్లప్పుడూ గుర్తిస్తుందని, వారికి సముచిత స్థానం కల్పించడంలో ముందుంటుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేసేవారికి ఉన్నత అవకాశాలు కల్పించడమే తమ విధానమని ఆయన పేర్కొన్నారు.

నూతనంగా శాసనమండలి సభ్యురాలిగా (ఎమ్మెల్సీ) నియమితులైన దళవాయి రమాదేవి మంగళవారం అమరావతిలో తన కుటుంబసభ్యులతో కలిసి మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, క్షేత్రస్థాయి కార్యకర్తగా తన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ఆమె మంత్రి లోకేశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆమె అన్నారు. ఈ భేటీలో మంత్రి లోకేశ్, రమాదేవిని అభినందించారు. పార్టీ పట్ల ఆమెకున్న విధేయత, చేసిన సేవలకు దక్కిన గుర్తింపు ఈ పదవి అని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడటానికి మరింత నిబద్ధతతో పనిచేయాలని ఆమెకు దిశానిర్దేశం చేశారు. శాసనమండలి వేదికగా ప్రజావాణిని బలంగా వినిపించాలని లోకేశ్ సూచించారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితురాలవడం తెలిసిందే.



## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే



**అమరావతి, నవతరం:** బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు.

**కూటమి కేబినెట్ కీలక నిర్ణయాలు**

బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు న్యాయం**

బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు,

మిగతా 4లో..

# మెగా డీఎస్సీ అద్భుతంగా నిర్వహించారు



## నారా లోకేశ్‌ను ప్రశంసించిన ఢిల్లీ మంత్రి

**న్యూ ఢిల్లీ, నవతరం:** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా టీచర్ పోస్టులను ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన తీరు అద్భుతమని ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా ప్రశంసించారు. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాలనా దక్షతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌లతో శిర్సా నేతృత్వంలోని ఢిల్లీ ప్రతినిధి బృందం భేటీ అయింది.

ఈ సందర్భంగా శిర్సా మాట్లాడుతూ, "ఢిల్లీలో టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. నియామకాలు మొదలుపెట్టగానే కోర్టు కేసులు, ఫిర్యాదులు, గందరగోళంతో ప్రక్రియ మొత్తం స్తంభించిపోతుంది. అలాంటిది ఏపీలో ఇంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఎలా సాఫీగా పూర్తి చేయగలిగారు?" అని మంత్రి లోకేశ్ ను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ విజయం సాధించినందుకు లోకేశ్ కు ఆయన అభినందనలు తెలిపారు.

దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, పక్కా ప్రణాళికతో, సాంకేతికతను వాడుకుని డీఎస్సీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. ఈ ప్రక్రియపై ప్రతిపక్షాలు అనేక ఆరోపణలు చేసినా, కోర్టులలో కనీసం ఒక్క చిన్న అక్రమం జరిగిందని కూడా నిరూపించలేకపోయాయని తెలిపారు. విద్యాశాఖ తనకు అత్యంత ఇష్టమైనదని, త్వరలోనే మరో 3 వేల మిగతా 3లో..

# నాటి బ్రిటీష్ పాలకులకు, నేటి కాంగ్రెస్‌కే భయం

- బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్, నవతరం:** వందేమాతరం గీతం విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేమాతరం అనగానే ఒకప్పుడు బ్రిటీష్ పాలకులకు ఏ విధమైన భయం కలిగేదో, నేడు కాంగ్రెస్ పార్టీకి సైతం అదే భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విషయంలో నాటి బ్రిటీష్ పాలకులకు, నేటి కాంగ్రెస్ నాయకులకు మధ్య పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల వైఖరి చూసి దేశ ప్రజలంతా విస్మయం చెందుతున్నారని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వందేమాతరం గీతాలాపనను నిరోధించడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. దేశంలో కేవలం కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో దేశ ప్రజల్లో స్ఫూర్తిని రగిల్చిన ఈ గీతం పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరికాదని బండి సంజయ్ హితవు పలికారు.

# ఫోటో జర్నలిస్టులను సన్మానించిన ఎర్ర యాకయ్య

- **ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన ఫోటోకు అవార్డు పొందిన ఫోటో గ్రాఫర్ల దుర్గారావు, శ్రవణ్ కుమార్, మాచర్ల నాగేశ్వరావులను శాలువాతో ఘనంగా సన్మానం చేసిన TWJF అధ్యక్షులు ఎర్ర యాకయ్య**



**కూకట్పల్లి, నవతరం:** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ కాలనీలో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూస్ ఫోటో కాంపిటీషన్-2026లో కూకట్పల్లి ఫోటో జర్నలిజం ప్రతిభ చూపిన దక్కన్ క్రానికల్ ఫోటో జర్నలిస్ట్ దుర్గారావు, నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరావుకి రాష్ట్ర స్థాయి అవార్డులు వరించిన సందర్భంగా సోమవారం రోజు కూకట్పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) నాగుల అంజిబాబు అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు యాకయ్య మాట్లాడుతూ పుట్ పాతుల మీద విధి వ్యాపారుల బ్రతుకులనూ ఎత్తిచూపుతూ తీసిన ఫోటోలకు ఈ గుర్తింపు లభించిందని, ప్రజా సమస్యలను బ్రతుకు చిత్రాలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి సీనియర్ జర్నలిస్ట్ రామారావు, సూర్య దినపత్రిక ఫోటో జర్నలిస్ట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధంలో నరకం చూశా..

- అమెరికాలో భారత సంగీతకారుడికి కష్టాలు



అమెరికాలో భారత సంతతికి చెందిన ప్రముఖ జాజ్ సంగీతకారుడు ప్రితేష్ వాలియాకు చేదు అనుభవం ఎదురైంది. వీసా గడువు ముగిసిందన్న ఆరోపణలతో యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయన్ను 14 రోజుల పాటు నిర్బంధంలో ఉంచారు. కాలిఫోర్నియాలోని అడెలాంటో నిర్బంధ కేంద్రంలో గడిపిన ఆ రోజులు తనను మానసికంగా కుంగదీశాయని, భయంతో పూర్తిగా కుప్పకూలిపోయినట్లు అనిపించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఆగస్టు 2న లాస్ ఏంజెల్స్‌కు తిరిగి వచ్చిన సమయంలో అధికారులు తనను అదుపులోకి తీసుకున్నారని ఆయన వెల్లడించారు. అనంతరం తనను అడెలాంటో కేంద్రానికి తరలించి 14 రోజుల పాటు నిర్బంధించారని తెలిపారు. ఇటీవల బాండ్‌పై విడుదలైన అనంతరం, ప్రితేష్ సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో ద్వారా తన అనుభవాన్ని పంచుకున్నారు.

"ఆ 14 రోజులు నా జీవితాన్ని శాశ్వతంగా మార్చేశాయి. ఈ కష్టకాలంలో నాకు అండగా నిలిచిన నా కుటుంబ సభ్యులు, స్నేహితురాలు, న్యాయవాది, సంగీత ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. వారు చూపిన ప్రేమ, మానవత్వంపై నాకు మళ్లీ నమ్మకాన్ని కలిగించింది" అని ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో పేర్కొన్నారు.

న్యూఢిల్లీలో పుట్టి పెరిగిన ప్రితేష్ వాలియా, చిన్న వయసులోనే భారతీయ శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. ఉన్నత సంగీత విద్యను అభ్యసించేందుకు ఆయన అమెరికా వెళ్లారు. కాగా, 27 ఏళ్లుగా అమెరికాలో నివసిస్తున్న భారత సంతతికి చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్ వెంకట నరసమాంబ వాసంశెట్టిని కూడా ఇటీవల అధికారులు నిర్బంధించడం గమనార్హం.

# సులభంగా నెలవారీ ఫాస్టాగ్ లోకల్ పాస్



**నేషనల్, నవతరం:** జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వాహనదారుల కోసం ఒక కీలకమైన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా 121 టోల్ ప్లాజాల్లో ఆన్‌లైన్ ఫాస్టాగ్ లోకల్ పాస్ సేవలను విస్తరించింది. అర్హులైన వారు ఇకపై నెలవారీ లోకల్ పాస్‌ల కోసం టోల్ ప్లాజాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, 'రాజమార్గయాత్ర' మొబైల్ యాప్ ద్వారానే వాటిని పొందవచ్చని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఈ నూతన విధానం ద్వారా నెలవారీ పాస్ కోసం టోల్ ప్లాజాలకు భౌతికంగా వెళ్లి, పత్రాలను సమర్పించే ప్రయాసకు తెరపడింది. టోల్ ప్లాజా నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే వారు ఈ పాస్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఈ పాస్ పొందిన వారు సంబంధిత టోల్ ప్లాజా గుండా నెల రోజుల పాటు అపరిమితంగా ప్రయాణించవచ్చు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి టోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను, సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యమని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

గతంలో పాస్ పొందాలంటే నివాస ధ్రువీకరణ పత్రాలు, ఇతర డాక్యుమెంట్లను టోల్ ప్లాజా సిబ్బందికి స్వయంగా అందజేయాల్సి ఉండేది. ప్రస్తుతం 'రాజమార్గయాత్ర' యాప్‌ను డిజిలాకర్, వాహన్ వంటి ప్రభుత్వ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో అనుసంధానించారు. దీని ద్వారా దరఖాస్తుదారుడి చిరునామా, వాహన వివరాలు, లింక్ చేయబడిన ఫాస్టాగ్ వంటి సమాచారం ఆటోమేటిక్‌గా వెరిఫై అవుతుంది. జీపీఎస్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా దరఖాస్తుదారుడి నివాసం 20 కిలోమీటర్ల పరిధిలో ఉందో లేదో కూడా నిర్ధారిస్తారు.

ఈ డిజిటల్ లోకల్ పాస్ సేవలను తొలిసారిగా 2026 జులైలో ఢిల్లీలోని ఒక టోల్ ప్లాజా వద్ద ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రస్తుతం వీటిని 121 ప్లాజాలకు విస్తరించగా, రాబోయే నెలల్లో మరిన్ని టోల్ ప్లాజాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ విధానం వల్ల మానవ ప్రమేయం తగ్గి, పౌరులకు సేవలు మరింత వేగంగా, సులభంగా అందుతాయని అధికారులు వివరించారు.

# వింత వ్యాధితో నీళ్లలోనే బతుకుతున్న బాలుడు

- **అండగా అనంత్ అంబానీ!**

**వెస్ట్ బెంగాల్, నవతరం:** పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ బాలుడు వింత వ్యాధితో బాధపడుతూ నిరంతరం నీటి కుంటల్లోనే గడపాల్సి వస్తోంది. ఈ విషయం తెలుసుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ మానవత్వంతో స్పందించి, అతడికి మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు వచ్చారు. ఆ కుర్రాడిని ప్రత్యేక విమానంలో ముంబైకి తరలించి, రిలయన్స్ ఫౌండేషన్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ఇక్బాల్ అనే బాలుడు గత కొంతకాలంగా ఓ అరుదైన సమస్యతో సతమతమవుతున్నాడు. నీటి నుంచి బయటకు వస్తే శరీరం తీవ్రమైన మంటలకు గురవుతుండటంతో అతను విలవిలలాడిపోతున్నాడు. ఏదో అతీతశక్తి తనను ఆవహించడం వల్లే ఇలా జరుగుతోందని అతను భావిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు నీటిలోనే ఉంటూ, ఆహారం కూడా అక్కడే తీసుకుంటున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

వైరల్ వీడియో చూసిన అనంత్ అంబానీ.. ఇక్బాల్ పరిస్థితికి చలించిపోయారు.



ఇక్బాల్ ది నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఎటువంటి ఫలితం లభించలేదు. ఖరీదైన వైద్యం చేయించే స్తోమత లేక, అసలు ఆ జబ్బేంటో తెలియక ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఈ నేపథ్యంలో అనంత్ అంబానీ చొరవ తీసుకుని, ఇక్బాల్‌ను ముంబైలోని సర్ హెచ్.ఎన్. రిలయన్స్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందిస్తున్నారు.

# రైతుల ఎరువులు టీడీపీ నేతల ఇళ్లకు

- 200 బస్తాల యూరియా అక్రమ నిల్వ - కూటమి ప్రభుత్వంపై వైసీపీ విమర్శలు
- మంత్రి అచ్చెన్నాయుడు స్వంత జిల్లాలోనే అక్రమాలు - సమాధానం చెప్పాలి
- 40 ఏళ్లుగా ఇచ్ఛాపురం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన టీడీపీ
- ఆగ్రహం వ్యక్తం చేసిన శ్యామ్ ప్రసాద్ రెడ్డి



**ఇచ్ఛాపురం, నవతరం:** ఇచ్ఛాపురం నియోజకవర్గం, ఇచ్ఛాపురం మండలం బిర్లంగి గ్రామంలో రైతులకు అందివ్వవలసిన ఎరువులు తెలుగుదేశం పార్టీ నేతల ఇళ్లకు చేర్చి దమ్ములు చేసి, ఎరువుల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన రైతులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బిర్లంగి గ్రామం చివరన వున్న రైతు సేవా కేంద్రానికి చేరవలసిన 200 బస్తాల యూరియాను గ్రామానికి మధ్యలో వున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కుటుంబానికి చెందిన గోడౌన్ లో దింపి, అక్రమ మార్గంలో అమ్ముకోడానికి చేసే ప్రయత్నంలో భాగమే రైతులకు చెందిన ఎరువుల అక్రమ నిల్వ అని శ్యామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించలేని కూటమి ప్రభుత్వం, వచ్చిన ఎరువులను సైతం తెలుగుదేశం పార్టీ నేతలకు అందించి రైతులకు కూటమి నాయకులు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యన్నారాయణ ను అసభ్యమైన పదంతో సంబోధించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారూ.. ఇప్పుడు చెప్పండి రైతుల ఎరువులను ప్రక్కదారి పట్టించిన శాఖకు మంత్రిగా వున్న మీకు ఎలా సంబోధించాలో? అని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి స్వంత జిల్లాలో ఎరువుల అక్రమ నిల్వ చేయడాన్ని మంత్రి ఎలా సమర్ధించుకుంటారో తెలపాలని నిలదీశారు. గత వైస్సార్సీపీ ప్రభుత్వంలో వున్న మిగతా 4లో..

# వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్న చంద్రబాబు



**అమరావతి, నవతరం:** సామాజిక న్యాయం దిశగా ఎన్డీఏ ప్రభుత్వం చరిత్రాత్మక అడుగు వేసింది. అత్యంత వెనుకబడిన వర్గంగా ఉన్న వడ్డెర సామాజిక వర్గానికి చెందిన సాధారణ కార్యకర్త దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవిని ఖరారు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇది కేవలం ఒక పదవి కాదని, వెనుకబడిన వర్గాల సాధికారత పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇద్దరికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వగా, అందులో ఒకటి అత్యంత వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన మహిళకు కేటాయించడం ద్వారా ఇచ్చిన మాటకు కట్టుబడ్డామని చంద్రబాబు ఉద్ఘాటించారు.

రమాదేవి గురించి చంద్రబాబు సభలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఆ అమ్మాయి ఒక మామూలు కార్యకర్త, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. ఎన్నికల్లో ఆమెకు ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోయాం. కానీ, మొట్టమొదటిసారిగా వడ్డెర కులానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఆరోజే మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం, చదువుకున్న మహిళ అయిన రమాదేవిని ఈరోజు శాసనమండలికి తీసుకుంటున్నాం" అని వివరించారు. ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యతో పాటు, బీసీ వర్గానికి చెందిన రమాదేవికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని ఆయన తెలిపారు. ప్రాణాలు పోగొట్టుకున్నా సిద్ధాంతాన్ని వదులుకోని ఎందరో బీసీ కార్యకర్తల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుంటున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ చారిత్రక నిర్ణయంతో పాటే, బీసీల రాజకీయ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే మరికొన్ని కీలక నిర్ణయాలను కేబినెట్ ఆమోదించినట్లు చంద్రబాబు వెల్లడించారు. బీసీల రాజకీయ ఎదుగుదలకు గొడ్డలిపెట్టుగా మారిన గత ప్రభుత్వ నిర్ణయాలను సరిదిద్దుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34% రిజర్వేషన్లను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34%, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టపరమైన బలం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీలు నాయకత్వ అవకాశాలను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పట్టణాల్లో సుస్థిర పాలన కోసం మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పరిపాలనా వికేంద్రీకరణను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న 13 జిల్లా ప్రజాపరిషత్తుల స్థానంలో 28 జెడ్పీలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయాలు బీసీలకు భిక్ష కాదని, భాగస్వామ్యం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# మెగా డీఎస్సీ అద్భుతంగా నిర్వహించారు

రెండవ పేజీ తరువాయి... ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరగడం వల్లే ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇది తాము చేపట్టిన సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించేందుకు 'లీప్' యాప్‌ను కూడా రూపొందించినట్లు వివరించారు.

**చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం**

ఏపీ పర్యటనలో భాగంగా ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తున్నామని శిర్సా తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) వంటి అంశాల్లో ఏపీ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. డేటాను ఇంత సమర్థవంతంగా వాడుకుని సుపరిపాలన అందిస్తున్న రాష్ట్రం ఏపీ మాత్రమేనని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక దార్శనికుడని, అభివృద్ధికి ఆయనో విశ్వవిద్యాలయం లాంటి వారని ప్రశంసించారు. "మీ విశ్వవిద్యాలయంలో మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి" అని ఆయన చమత్కరించారు. అమరావతి నిర్మాణం అద్భుతంగా ఉందని, భవిష్యత్తులో ఇది ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డేటా డ్రివెన్ గవర్నెన్స్, స్మార్ట్ గవర్నెన్స్ వంటి అంశాల్లో ఢిల్లీ ప్రభుత్వానికి ఏపీ సహకారం అందించాలని శిర్సా కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించి, పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. అనంతరం ఢిల్లీ ప్రతినిధి బృందాన్ని మంత్రులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో ఆత్మీయ సమావేశం

- వార్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటాం
- రాబోయే మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి
- పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్లగిరి బాబు

**పలాస, నవతరం:** ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ధ్యేయమని పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్లగిరి బాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డులోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బల్లగిరి బాబు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీని అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో వైఎస్ఆర్సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేసి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. వార్డులో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, వీధి లైట్లు సరిగా వెలుగకపోవడంతో రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త సకాలంలో తీయకపోవడం వల్ల దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగిందని తెలిపారు. అదేవిధంగా వార్డులోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం పడితే మురికి నీరు రోడ్లపై నిలుస్తుందని చెప్పారు. దీనివల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంకా పెన్షన్లు మంజూరు కాలేదని, దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలన్నింటినీ మున్సిపల్ కమీషనర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కోసం తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకోళ్ల వెంకటరమణ, సనపల చెన్నారావు, ఎక్స్ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, డి. నాగభూషణరావు, వల్లభ వైకుంఠరావు, వార్డులోని యువకులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ కక్షతో కేసు పెట్టడం సబబు కాదు

- ఉద్దానం ప్రజలకు డాక్టర్ అప్పలరాజు చేసిన సేవలు మరువలేనివి
- జైలు నుంచి విడుదలైన అప్పలరాజుకు సంఘీభావం
- పలాసలో డాక్టర్ అప్పలరాజును పరామర్శించిన డాక్టర్ కోదండరాం యాదవ్



**పలాస, నవతరం:** ప్రముఖ సామాజిక వేత్త, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఉలాల కోదండరాం యాదవ్ మంగళవారం పలాసలో రాష్ట్ర మాజీ మంత్రి, వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు డాక్టర్ సీదిరి అప్పలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఒక రోడ్డు ప్రమాద ఘటనను హత్య కేసుగా చిత్రీకరించి, అరెస్ట్ చేసి జైల్లో 23 రోజులు తర్వాత బెయిల్ పై విడుదలైన తరువాత ఆయన్ని పరామర్శించి, డాక్టర్ కోదండరాం తమ సంఘీభావాన్ని తెలియజేశారు. వైద్యులు అంటే ప్రాణాలు పోసేవాడని, ప్రాణాలు తీసేవాడు కాదని, అటువంటి మానవతా మూర్తికి రాజకీయ కక్షతో అక్రమంగా కేసు బనాయించి జైలు పాలు చేయడం సబు కాదని డాక్టర్ కోదండరాం అన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన రోజుల్లో కానీ, అంతకుముందు ఒక వైద్యునిగా ఉద్దానం ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందించి ప్రాణదాతగా నిలిచిన డాక్టర్ అప్పలరాజుపై అక్రమంగా కేసు బనాయించడం చాలా విచారకరం అన్నారు. ఉద్దానం ప్రాంతంలో కొన్ని దశాబ్దాల నుంచి కిడ్నీ మహమ్మారి వ్యాధితో వేలాదిమంది మరణించారని, ఇంకా మరణిస్తున్న నేపథ్యంలో.. నాడు వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగులతో ఒక సమావేశం ఏర్పాటు చేయించారని తెలిపారు. తర్వాత అధికారంలోకి వచ్చాక ఏకంగా 70 కోట్ల రూపాయల ఖర్చుతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రంతో పాటు 200 పడకల ఆసుపత్రి నిర్మాణానికి డాక్టర్ అప్పలరాజు చేసిన కృషి మరువలేమన్నారు. అంతేకాక కిడ్నీ రోగులకు ప్రతినెల మందులు ఖర్చు కోసం నెలకు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించే పథకం అమలుకు ప్రభుత్వాన్ని ఒప్పించి చాలా శ్రమించారని డాక్టర్ కోదండరాం గుర్తు చేశారు. రాజకీయాలలో ఎన్ని విమర్శలు చేసుకున్నా కూడా.. వ్యక్తిగతంగా రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సబు కాదన్నారు. చాలాకాలం నుంచి ఉద్దానం ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ.. నడిచే దేవుడిగా డాక్టర్ అప్పలరాజుని ఈ ప్రాంత ప్రజలు కీర్తిస్తుంటారని అన్నారు. జైలుకు ఆయన్ని తరలించిన గాని, వైయస్సార్సీపి శ్రేణులు ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా తమ నాయకుడిని కాపాడుకునేందుకు అనేక నిరసన కార్యక్రమాలతో పాటు, నిరాహార దీక్షలు, గంగమ్మ తల్లికి పూజలు చేసి తమ అభిమానాన్ని చాటుకొని.. అండగా నిలవడం గొప్ప విశేషం అన్నారు. డాక్టర్ కోదండరాంతో పాటు పలు ప్రజా సంఘాల నేతలు డాక్టర్ అప్పలరాజుకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

# అమ్మ ఆకాశం... నాన్న అంతరిక్షం..!



రచన
పోలయ్య కూకట్లపల్లి

అమ్మ ఒడిలోనే –
ఆగాయి నా కన్నీటి ధారలు
అమ్మ ప్రేమ –
ఆకాశానికే అందని అమృతధార
అమ్మ మాట –
అలసిన మనసుకు చల్లని జలధార

నేను పడిన ప్రతిసారీ –
లేపిన మమతా మూర్తి అమ్మ
నేను ఓడితే ప్రతిసారీ –
ఓదార్చిన ఓర్పుల దీపం అమ్మ

అమ్మ ఒడి ఒక ఆకాశపు హాయి
అమ్మ మాట ఓ అమృతబిందువు
అమ్మ చేతుల్లో మమతా మాధుర్యం
అమ్మ కన్నుల్లో వెన్నెల వైభవం

నా మౌనంలో దాగిన బాధను
ఆవేదనా అక్షరాలను చదివే
మాతృహృదయం అమ్మది...
నా నవ్వుకోసం తన కన్నీటిని
కనురెప్పల మాటున
దాచిన అనురాగ సముద్రం అమ్మ

నా అడుగులకు
ఆరనిదీపమై దారిచూపింది అమ్మ
నా జీవితానికి
తొలి పొద్దు వెలుగై నిలిచింది అమ్మ

నాన్న చూపుల్లో –
కనిపిస్తాయి నాకు
రేపటి వెలుగు దారులు
నాన్న నీడ –
ఎండలో నడిచే ధైర్యవృక్షం
నాన్న మాట –
చీకటిలో దారిచూపే దీపస్థంభం

నేను పడితే తడబడితే
నిలబెట్టే నమ్మకపు కొండ నాన్న
నేను వెనుకడుగు వేస్తే
ముందుకు నడిపే గుండె నాన్న

నాన్న నీడలో నిశ్చింత నడక
నాన్న మాటలో నమ్మకపు వెలుగు
నాన్న భుజమే నాకు బలమైన బాట,
నాన్న ధైర్యమే నాకు విజయగీతిక

నా కలల కోసం తన కలలనే
మౌనంగా మరచిన త్యాగమూర్తి నాన్న
నా గెలుపుకోసం తన ఓటమినే
ఒడిలో దాచుకున్న సమరయోధుడు నాన్న

అమ్మా... నా ఆకాశం
నాన్నా... నా అంతరిక్షం
అమ్మ ... నా అమృత వర్షం
నాన్న ... నా కలల కల్పవృక్షం
అమ్మకు తెలుసు – నా ఆకలి కేకలు
నాన్నకు తెలుసు – నా ఆశల రేఖలు

అమ్మ మమత...జీవనానికి ఊపిరైతే
నాన్న ధైర్యం... జీవితానికి దిక్సూచి
ఆ ఇద్దరున్న ఇల్లే ఇంద్రభవనం
అది ఓ నవ్వుల నందనవనం
అది ఓ సంతోషాల స్వర్గసీమ
అమ్మ ప్రేమ–నాన్న బలం
మా జీవితానికి రెండు రెక్కలు

వారి ఆశీర్వాదాలే మాకు దారిదీపాలు
వారే ఈ జన్మకు తెరిచిన స్వర్గద్వారాలు
వారి చల్లని చూపులే
మాకు స్వర్ణాభరణాలు
వారి మాటలే మాకు మంగళ తోరణాలు
వారి ఆదర్శాలే మాకు వెలుగు కిరణాలు

అమ్మా నాన్నలే – మాకు రెండు కన్నులు
అమ్మా నాన్నలే – మాకు ప్రత్యక్ష దైవాలు

అమ్మ అంటే–
అనంతమైన ఆప్యాయతకు ప్రతిరూపం...
నాన్న అంటే–
నా బంగారు భవిష్యత్తుకు భరోసా దీపం..!

# పరికి చెరువు ఆక్రమణలు తొలగించండి

- ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లలో పాగా, అక్రమ లేఅవుట్ లతో అమ్మకాలు
- లక్షలు, కోట్లు దండుకున్న కేటుగాళ్లు.. బొక్కా బోర్లా పడుతున్న కొనుగోలుదారులు
- చర్యలు తీసుకోవడంలో విఫలమైన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- హైడ్రా తోనే సాధ్యమంతున్న స్థానిక ప్రజలు, భవిష్యత్ తరాలకొరకు పాటుపడాలి





**కుత్బుల్లాపూర్, నవతరం:** హెచ్ఎండిఏ పరిధిలోని మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ భూముల్లో కొందరు కేటుగాళ్లు అక్రమ వెంచర్లు వేసి, తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ లతో కోట్ల రూపాయలు దండుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందులో కొందరు దళారులు అమాయక ప్రజలను నమ్మించి ఇప్పటికే కొన్ని వందల ప్లాట్ లు అమ్మి సొమ్ము చేసుకున్నారు. తప్పుడు పత్రాలతో కొందరు అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తుంటే.. బాలకృష్ణ లాంటి వారు నోటరీల పై అగ్రిమెంట్ లు చేసి ఒక్కో 80 గజాల ప్లాట్ ను కొన్ని లక్షల రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. లెనిన్ నగర్, భూదేవి హిల్స్, ఎల్లమ్మబండ, శిరిడీ హిల్స్, మహదేవపురం హద్దులుగా ఉన్న పరికి చెరువు ను నలువైపులా మట్టి వేసి కబ్జా చేస్తూ.. తప్పుడు పత్రాలతో ఆక్రమణల పర్వం కొనసాగిస్తున్నారు కబ్జాకోరులు. ఇదే అదనుగా భావించిన కొందరు ఆశావహులు తక్కువ ధరకు భూములు దొరుకుతున్నాయని భావించి.. కొనుగోలు చేస్తున్నారు. వీరు సదరు భూములను కొనుక్కుంటున్నారా లేక అందరూ కలిసి గూడుపుఠాణి చేసుకుంటున్నారా అనే విషయంపై లోతైన అధ్యయనం చేయాల్సి ఉంది. మహదేవపురం పక్కనే ఉన్న పరికి చెరువు ను ఆక్రమించి కొందరు కేటుగాళ్లు (ఆర్థిక నేరగాళ్లు) కొన్ని కోట్ల రూపాయలు విలువ చేసే భూములు మాయం చేసే పనిలో ఉన్నారు. పరికి చెరువు భూములను ఆక్రమిస్తూ.. చెత్త, మట్టితో పూడ్చివేతలు చేస్తూ ప్లాట్ లుగా తయారు చేస్తున్నారు కబ్జాకోరులు. కొన్ని సందర్భాలలో ఫిర్యాదులకు స్పందించిన రెవెన్యూ అధికారులు తాత్కాలిక కూల్చివేతలు కూడా చేశారు. అయినా కూడా బరి తెగించి, దుస్సాహసం చేస్తున్న కొందరు మాత్రం 'హైడ్రా' లాంటి వ్యవస్థ లతో మాకు ఎలాంటి భయం లేదు, ఇంకా రెండు సంవత్సరాలు గడిచిపోతే మా ప్రభుత్వం వస్తుంది, అన్నీ సర్దుకుంటాయి, మమ్మల్ని ఎవరేం చేయలేరంటూ మేకపోతూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.





స్థానికంగా ఉంటున్న కొందరు ఛోటా, మోటా గల్లీ లీడర్లు.. అధికార పార్టీ నాయకుల పేర్లు చెప్పుకుని పబ్బం గడుపుకునే పనిలో ఉన్నారు. కిష్టారెడ్డి లాంటి మరికొందరు పరికి చెరువును ఆక్రమించి మహదేవపురం ఫేజ్ – 2 ప్లాట్ నంబర్ 210 పక్కనే ఒక రూము, పాత రేకుల ఫెన్సింగ్ వేసి నెలకు పది వేల రూపాయల చొప్పున కిరాయిలు సైతం వసూలు చేస్తున్నారు. అక్రమ షెడ్లు, అక్రమ రూముల నిర్మాణాలు చేపడుతూ.. చెరువు భూములను ఆక్రమిస్తూ.. భవిష్యత్ తరాలతో చేగాటం ఆడుతున్న సదరు కేటుగాళ్లపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలు చెరువుల ఆక్రమనలపై 'హైడ్రా' ప్రజావాణిలో ఫిర్యాదులు కోకొల్లలుగా అందుతున్నాయి. అందుకు స్పందిస్తున్న హైడ్రా కమిషనర్ & సిబ్బంది ఇప్పటికే ఎన్నడూ పరిష్కారం చూపని ఫిర్యాదులనను సైతం ఛాలెంజ్ చేస్తూ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపింది హైడ్రా. అదే తరహాలో కూకట్ పల్లి – కుత్బుల్లాపూర్ మండలాల పరిధిలో విస్తరించి ఉన్న 'పరికి చెరువు' ఆక్రమణలను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


పరికి చెరువు భూములు మాయం చేస్తున్న ముఠా...!

అంతా అడుగు నాశనం

- ప్రభుత్వ భూములు, నాళాలు, చెరువులు మాయం
- అందినకాడికి దండుకుంటున్న కేటుగాళ్లు
- జగద్గిరిగుట్ట పరికిచెరువు భవిష్యత్ తరాలకు మిగిలేనా..?
- ఓ వైపు భూదేవి హిల్స్, మరోవైపు మహదేవపురం..!
- పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లు మాయం
- చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న ఇరిగేషన్ శాఖ
- హైడ్రా అధికారులు కల్పించుకోవాలంటున్న స్థానికులు

గాజులరామారం, నవతరం: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం గ్రామం 'పరికి చెరువు' కు సంబంధించి కొన్ని ఎకరాల ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి. స్థానికంగా ఇంత జరుగుతున్నా.. ఏ ఒక్క కార్పోరేటర్ (జగద్గిరిగుట్ట & గాజులరామారం) స్పందించి చెరువు భూములు, ప్రభుత్వ భూములు కాపాడిన దాఖలాలు లేవు. ఇదే అదనుగా భావించిన కొందరు భూకబ్జాదారులు పరికి చెరువు ఎఫ్టీఎల్ & బఫర్ జోన్ భూములు ఆక్రమించి, తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి కొన్ని కోట్ల రూపాయలు దండుకున్నారు. అందులో భాగంగానే.. తక్కువ ధరకు భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని తెలుసుకున్న కొందరు కేటుగాళ్లు చారానా, బారానాకు కొనుక్కుని.. ప్రస్తుతం కొన్ని లక్షల రూపాయలు దండుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రధానంగా, కిష్టారెడ్డి అనే వ్యక్తి.. తనకేమీ తెలియదన్నట్లు, ఈ రోజు హైదరాబాద్ కు వచ్చి స్థిరపడ్డట్లు, దగ్గరి బంధువులే మోసం చేశారన్నట్లు ముచ్చట్లు చెబుతూ.. కొన్ని కోట్ల రూపాయల రూపాయల విలువ చేసే పరికి చెరువు భూములను మాయం చేసే పనిలో నిమగ్నమయ్యాడు, అందుకు తన తమ్ముడు గుంట నక్క వేషాలు వేస్తూ.. మరో నాలుగు వందల గజాల చెరువు శిఖం భూములకు స్కెచ్ వేసినట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'హైడ్రా' లాంటి వ్యవస్థను తీసుకువచ్చి చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కాపాడుతామని చెబుతున్నా.. ఒక్కో గజం ప్రభుత్వ భూమి (ఎఫ్టీఎల్) రెండు లక్షల రూపాయలు అమ్మకానికి పెట్టారంటే అతిశయోక్తి కాదు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలో ఉన్న పరికి చెరువు భూములను కాపాడి తరువాతి తరాలకు అందించాల్సిన బాధ్యత కేవలం రేవంత్ రెడ్డి సర్కార్ కే కాకుండా ప్రతి ఒక్క పౌరుడికి ఉంది. అందుకు సంబంధించి స్థానిక పరికి చెరువుకు సంబంధించిన ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ స్పందించి గత పది సంవత్సరాలుగా చెరువులు, కుంటలు ఆక్రమిస్తున్న కిష్టారెడ్డి లాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించి, భవిష్యత్ తరాలకు పాటుపడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే, అందినకాడికి దోచుకుని, అడుగు నాశనం చేసి తమకేమీ తెలియదని జబ్బలు చర్చుకుంటున్నారు ఇలాంటి ఆర్థిక నేరగాళ్లు. ఓ వైపు అసదుద్దీన్ ఓవైసీ లాంటి 'ఫాతిమా' కాలేజీ లనే తొలగించాలని డిమాండ్ చేస్తున్న యువత ఇలాంటి సహజ వనరులను దోచుకుంటున్న వెంచర్ నిర్వాహకులను, అందులో చారణా, బారానా కు కొనుక్కున్నామంటూ పబ్బం గడుపుకుంటున్న దొంగ ఎధవలను వదిలిపెడుతుందా అంటూ స్థానిక ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం సరిహద్దులో ఉన్న పరికి చెరువు ఇప్పటికే కొందరు బడాబాబుల చేతిలో పడి సగానికి పైగా అన్యాక్రాంతమైంది. కాసుల కక్కుర్తిలో ఉన్న అప్పటి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ దొంగల చేతిలో బలై పోయిన పరికి చెరువును కాపాడటానికి ఇప్పటికైనా 'హైడ్రా' అధికారులు ముందుకు వచ్చి 'కిష్టా రెడ్డి' లాంటి అమాయకులను కాపాడుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పరికి చెరువునాక్రమించి కిష్టారెడ్డి నిర్మించుకున్న ఇటుకల సామ్రాజ్యం

పరికి చెరువు మట్టితో పూడ్చివేత

ఎఫ్టీఎల్ లో దర్గాగా మట్టివేసి కబ్జాకు యత్నం

అనుకున్నట్టుగానే.. ఐదేండ్లలో చెరువును

## హైడ్రాను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం చేయాలి

- హైడ్రా కమిషనర్‌ను కలిసి, మద్దతు తెలిపిన పలువురు వృత్తి నిపుణులు

**హైదరాబాద్, నవతరం:** గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేసి వరదలు లేని నగరమే లక్ష్యంగా హైడ్రాను దిశానిర్దేశం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి పలు రంగాలకు చెందిన వృత్తి నిపుణులు మద్ధతు పలికారు. హైడ్రాను రాష్ట్ర వ్యాప్తం చేసి చెరువులు, వరద కాలువలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంతో పాటు.. శివారు ప్రాంతాలకు చెందిన వివిధ వృత్తి నిపుణులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను కలిసి హైడ్రా కార్యకలాపాలకు మద్ధతు పలికారు. పలువురు న్యాయవాదులు, పర్యావరణవేత్తలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వారు.. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఇలా వివిధ వృత్తుల్లో సేవలందిస్తున్నవారు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. హైడ్రా పునరుద్ధరించిన చెరువులను చూస్తే ఎంతో ముచ్చటేస్తోందన్నారు. నగరంలో చెరువులన్నీ ఇదే మాదిరి ఇన్లెట్లు, ఔట్‌లెట్లతో అభివృద్ధి జరిగితే చాలా వరకు వరదలను నియంత్రించ వచ్చునన్నారు. చెరువుల చెంత హైడ్రా అభివృద్ధి చేస్తున్న గ్రీనరీ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. మూడు మీటర్ల మేర పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికతో భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి గతంలో ఉండేదని.. ఇప్పుడు పూడికను పూర్తిగా తొలగించి చెరువులను అభివృద్ధి చేయడంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.



ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకే చెరువుల్లో నీరుచేరి స్వచ్ఛంగా కనిపిస్తున్నాయన్నారు. జలవనరులను కాపాడితే ప్రకృతి పరిరక్షణకు వెసులుబాటుంటుందని.. ఆ దిశగా హైడ్రా చర్యలు అభినందనీయమన్నారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలు కాకుండా చూడడం సామాన్యమైన విషయం కాదని పలువురు పేర్కొన్నారు. హైడ్రా పట్ల నగర ప్రజల్లో చాలా నమ్మకం ఏర్పడిందని.. ఇదే విధంగా పని చేసి చక్కటి వాతావరణం ఉండేలా చూడాలని కోరారు.

## రైతుల ఎరువులు టీడీపీ నేతల ఇళ్లకు

**రెండవ పేజీ తరువాయి..** ఉచిత వ్యసాయ భీమా పధకాన్ని ఇట్టివేసిన కూటమి ప్రభుత్వం నేడు అసెంబ్లీ సమావేశం జీరో అవర్ లో ఇచ్ఛాపురం ఎంఎల్ఏ వ్యవసాయ భీమా గురించి మాట్లాడడం విడ్డురంగా ఉందని శ్యామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గత 40 ఏళ్ళుగా ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ వ్యవసాయ రంగాన్ని, సాగునీటి వ్యవస్థలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇచ్ఛాపురం నియోజకవర్గం వ్యవసాయరంగం బీడుగా మార్చారన్నారు. అసెంబ్లీ సంబంధిత శాఖ నుండి కనీసం సమాధానం కూడా రాని జీరో అవర్ లో ఇచ్ఛాపురం ఎంఎల్ఏ సాగునీటి గురించి, రైతాంగం గురించి మాట్లాడడం దెయ్యాలే వేదాలు వల్లించినట్లుందని శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ పత్రికా ప్రతినిధుల సమావేశంలో వైస్సార్సీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, మాజీ డీసీఎంస్ అధ్యక్షులు సల్ల దేవరాజు, ఇచ్ఛాపురం మండలం పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ సాలిన గాంధీ, మాజీ జడ్పీటీసీ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి దక్కత నూకయ్య రెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు కారింగి త్రినాథ్, జిల్లా సంస్కృతిక విభాగం కార్యదర్శి సాడి దుర్యోధన, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

**మొదటి పేజీ తరువాయి...** దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

### గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.

### బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక

తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్నికలు తక్షణావసరం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism - NiMA) - Bureau Chief, Telangana, 9618907705,
E - mail: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com